## ఇందల్వాయిలో వనదేవతలకు బోనాల సమర్పణ



ఇందల్వాయి, బతుకమ్మ :ఇందల్వాయి మండల కేంద్రంలోని చంద్రాయన్ పల్లి, గన్నారం, తీర్మాన్ పల్లి, మల్లాపూర్, గౌరారం, డోన్కల్ గ్రామాలలో ఆదివారం గ్రామంలోని వన దేవతలకు బోనాలను సమర్పించుకొని మొక్కులు తీర్చుకున్నారు, వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు సమృద్ధిగా పండాలని ఈ సందర్భంగా వనదేవతలను గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, సర్పంచ్, ఉప సర్పంచ్ లు ప్రార్థించారు. వనదేవతల మొక్కులను తీర్చుకున్నటువంటి గ్రామ కమిటీ సభ్యులు వన భోజనాలకు కుటుంబ సమేతంగా తరలి వెళ్లారు. ఆదివారం పోచమ్మ పండుగ సందర్భంగా గ్రామంలో ప్రతి ఒక్కరు వనదేవతల సమక్షంలో ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. వర్షాకాలంలో వర్షాలు సమృద్ధిగా కురిస్తే కట్ట మైసమ్మకు సైతం బలి ఇస్తామని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లోకని గంగమని గంగారం, ఉప సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, తీర్మాన్ పల్లి గ్రామ సర్పంచ్ చింతల కిషన్, ఉప సర్పంచ్ రవి, గన్నారం సర్పంచ్ కరణం సుజాత శ్రీనివాస్, చంద్రన్న పల్లి సర్పంచ్ ఆరేటి రఘు, ఉప సర్పంచ్ తో పాటు ఇందల్వాయి గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ మహేందర్, జితేందర్, కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు నవీన్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## గూపన్ పల్లి గ్రామంలో ఘనంగా పోచమ్మకు బోనాలు



నిజామాబాద్ రూరల్, బతుకమ్మ :నిజామాబాద్ జిల్లా కేంద్రం లోని 3వ డివిజన్ గూపన్ పల్లి గ్రామంలో గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గ్రామదేవత పోచమ్మ అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు ఆలయానికి పెద్ద ఎత్తున తరలివచ్చారు. మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో అలంకరించిన బోనాలను తలపై ఎత్తుకుని ఊరేగింపుగా తీసుకువెళ్లి అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా శివసత్తులు పూనకంతో భక్తులను ఆకట్టుకోగా, డప్పు చప్పుళ్లు, ఒగ్గు కళాకారుల నృత్యాలు, సంప్రదాయ కళారూపాలు గ్రామంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గ్రామ వీధులన్నీ భక్తి గీతాలతో మార్మోగిపోగా, యువకులు, మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని పండుగను ఆనందంగా జరుపుకున్నారు. పోచమ్మ అమ్మవారి ఆశీస్సులతో గ్రామానికి సుఖశాంతులు, పంటలు సమృద్ధిగా కలగాలని గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, మూడో డివిజన్ కార్పొరేటర్ ప్రసన్న శ్రీనివాస్ రెడ్డి, గ్రామస్తులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



## ఈ హెచ్ ఎస్ కటింగ్ ప్రభుత్వ ఏకపక్ష నిర్ణయం

### సీఎం, డిప్యూటీ సీఎం జోక్యం చేసుకొని కోతలను రద్దు చేయాలి

### పిఆర్ టియు తెలంగాణ జిల్లా గౌరవ అధ్యక్షులు కృపాల్ సింగ్ సోడి



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :హెల్త్ కార్డులకు సంబంధించిన విధివిధానాలు ప్రకటించకుండా, ఉపాధ్యాయ సంఘాలతో చర్చించకుండా ప్రీమియం వసూలు చేయడం, పథకం పై పూర్తి సమాచారం ఇవ్వకుండా జీతాల్లో కోత విధించడం అన్యాయమని పిఆర్ టియు తెలంగాణ జిల్లా గౌరవ అధ్యక్షులు కృపాల్ సింగ్ సోడి అన్నారు. ఈ హెచ్ ఎస్ చందా 1.5% మినహాయింపు పై జీవో ఇవ్వకుండా ఆర్థిక శాఖ అత్యుత్సాహంతో ఈ హెచ్ ఎస్ చందా పేరిట ఉద్యోగుల మే నెల వేతనాల్లో కోత విధించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. కార్డు ఇయ్యకుండానే కటింగ్ చేయడం పై ఉద్యోగులు ఆర్థిక శాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారన్నారు. తక్షణమే సీఎం, డిప్యూటీ సీఎం జోక్యం చేసుకొని వేతనాల్లో కోతలు నిలిపి వేయాలని పిఆర్ టియు తెలంగాణ జిల్లా గౌరవ అధ్యక్షులు కృపాల్ సింగ్ సోడి డిమాండ్ చేశారు.

# నేడు కుమ్రం భీం-ఆసిఫాబాద్ జిల్లాకు సీఎం రేవంత్ రెడ్డి

### రూ.112.14 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

### విద్యుత్ మౌలిక సదుపాయాలు, సౌర విద్యుత్ ప్రాజెక్టు, మున్సిపల్ అభివృద్ధి పనులకు శ్రీకారం

కుమ్రం భీం-ఆసిఫాబాద్, బతుకమ్మ :ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సోమవారం కుమ్రం భీం-ఆసిఫాబాద్ జిల్లాలో పర్యటించనున్నారు. జిల్లాలో చేపట్టనున్న పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ముఖ్యమంత్రి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. మొత్తం రూ.112.14 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు సీఎం శ్రీకారం చుట్టనున్నారు. ఈ పర్యటనలో భాగంగా చింతలమానేపల్లి మండలంలోని కౌటాల (రవీంద్రనగర్ క్యాంపు నం-2) గ్రామంలో ఏర్పాటు చేయనున్న 132/33 కేవీ విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.56.55 కోట్లు. రెబ్బెన మండలం నాంబాల్ గ్రామంలో రూ.6 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్న సౌర విద్యుత్ ప్లాంట్ పనులకు కూడా సీఎం శంకుస్థాపన చేయనున్నారు. అదే విధంగా చింతలమానేపల్లి, గుడ్లబోరి, కాపువాడ, చింతకుంట, అంకుషాపూర్ ప్రాంతాల్లో నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాల పనులకు కూడా ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టనున్నారు. ఈ ఉపకేంద్రాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా మరింత బలోపేతం కావడంతో పాటు వ్యవసాయం, పరిశ్రమలు, గృహ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందుబాటులోకి రానుంది. జిల్లాలోని ఆసిఫాబాద్ మున్సిపాలిటీలో రూ.15 కోట్లతో చేపట్టనున్న తొమ్మిది అభివృద్ధి పనులు, కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో రూ.18.70 కోట్లతో చేపట్టనున్న



ఎనిమిది అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాల ద్వారా జిల్లాలో విద్యుత్ మౌలిక సదుపాయాల విస్తరణ, పునరుత్పాదక ఇంధన వినియోగ ప్రోత్సాహం, పట్టణ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి జూపల్లి తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఏర్పాట్లు పూర్తయ్యాయని చెప్పారు.

## మాల సంఘం అభివృద్ధికి నా వంతు కృషి చేస్తా...

### నగర మేయర్ కూరగాయల ఉమారాణి

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :కోట గల్లి మాల సంఘం అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానని, వీలైనంత నిధులు ఇప్పిస్తానని నగర మేయర్ కూరగాయల ఉమారాణి స్పష్టం చేశారు. ఆదివారం కోటగల్లి మాల సంఘంలో మేయర్ దంపతులకు సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ మాల సంఘం సభ్యుల్లో 60 శాతం నేను చిన్నప్పటి నుంచి చూసిన వారేనని అన్నారు. సంఘానికి అవసరమైన ఎస్టిమేషన్ తయారు చేయించుకొని తనకు ఇస్తే పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ తో మాట్లాడి అవసరమైన నిధులు కేటాయింపచేస్తానని తెలిపారు. తాను పదవి



ఉన్నా లేకున్నా కాంగ్రెస్ పార్టీలో వివిధ స్థాయిలో పనిచేసి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోటగల్లి




మాల సంఘం అధ్యక్షులు నల్ల ప్రసాద్, ప్రధాన కార్యదర్శి సక్కి సతీష్, కోశాధికారి చెక్క సాగర్, ఉప కోషాధికారి ప్రవీణ్, ముఖ్య సలహాదారులు సుంకరి లక్ష్మీనారాయణ, ప్రచార కార్యదర్శి కాదు సత్యనారాయణ, సీనియర్ నాయకులు సాధు నారాయణ, నల్ల బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదానికి గురైన అన్నదమ్ముల్ల ఇళ్లు

### మంటల్లో పూర్తిగా కాలిపోయిన గృహోపకరణాలు



మెండోరా, బతుకమ్మ :మెండోరా మండల కేంద్రంలో ఆదివారం రెండు ఇళ్లల్లో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఈ అగ్నిప్రమాదంలో అన్నదమ్ములైన కుమ్మరి రాజరాపు రాజేశ్వర్, రాజరాపు బక్కన్న ఇళ్లలోని గృహోపకరణాలు, నగదు సహా సామగ్రి పూర్తిగా దగ్ధమయ్యాయి. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం పౌర్ణమి సందర్భంగా ఇంట్లో దేవుని వద్ద దీపం వెలిగించి బక్కన్న భార్య పద్మ బయటకు వెళ్లిందని, కొద్దిసేపటి తర్వాత ఇంట్లో ఒక్కసారిగా మంటలు చెలరేగి, పక్కనే ఉన్న రాజేశ్వర్ ఇంటికి కూడా వ్యాపించాయన్నారు. దీంతో రెండు ఇళ్లలో భారీగా మంటలు వ్యాపించి ఆస్తినష్టం సంభవించిందన్నారు. మంటలను గమనించిన స్థానిక కాలనీవాసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అయితే అప్పటికే రెండు ఇళ్లలోని గృహోపకరణాలు, నగదు, ఇతర సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. బక్కన్న ఇంట్లో రూ.15,800 నగదు, ఇతర వస్తువులు దగ్ధమవగా, రాజేశ్వర్ ఇంట్లో రూ.8,000 నగదు సహా సామగ్రి అగ్నికి ఆహుతైంది. రెండు ఇళ్లలో కలిపి సుమారు రూ.25 వేల మేర ఆస్తి నష్టం జరిగినట్లు రెవెన్యూ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి సంఘటనా స్థలాన్ని సందర్శించి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. తక్షణ సహాయంగా రాజేశ్వర్‌కు 50 కిలోల బియ్యం, బక్కన్నకు 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. పూర్తి నష్టం అంచనా నివేదికను ప్రభుత్వానికి సమర్పించి, ప్రభుత్వం నుంచి లభించే అన్ని రకాల సహాయాన్ని బాధిత కుటుంబాలకు అందేలా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

## బలవంతంగా ఈహెచ్‌ఎస్ మినహాయించడం సరి కాదు

### మినహాయించిన వేతనాన్ని ఉద్యోగుల ఎకౌంటుకు జమ చేయాలి

### ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు కేశపురం రమేష్



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :ప్రభుత్వం ఎంప్లాయిస్ ఆరోగ్య పథకం కోసం ఉద్యోగుల మే నెల వేతనం నుండి 1.5 శాతం మినహాయిస్తూ పేస్లిప్స్ జనరేట్ చేయడం సరి కాదని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు కేశపురం రమేష్ ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య పథకానికి సంబంధించి విధివిధానాలు రూపొందించకుండా, కనీసం డ్రాయింగ్ అధికారులకు సమాచారం ఇవ్వకుండా ప్రభుత్వం దొడ్డిదారిన ఉద్యోగుల వేతనం నుండి 1.5 శాతం మినహాయింపు చేయడాన్ని ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యాయ సంఘం పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాష్ట్రంలోని ఏ హాస్పిటల్స్ లో ఈ ఆరోగ్య పథకాన్ని అమలు చేస్తున్నారనే స్పష్టత లేదని, భార్యాభర్తలు ఉద్యోగులైన సందర్భాలలో, తల్లిదండ్రులు ఉద్యోగులైన సందర్భాల్లో, వేతన మినహాయింపులు ఏ విధంగా చేస్తారనే నిబంధనలు రూపొందించకుండానే ప్రతి ఉద్యోగం నుండి మినహాయింపు చేశారన్నారు. ఇది అక్రమమైన చర్యగా భావిస్తున్నామని, హెల్త్ కార్డులు జారీ చేయకుండా, టీచర్ల సమ్మతి తీసుకోకుండా మినహాయించిన 1.5 శాతం వేతనాన్నీ ఉద్యోగుల ఎకౌంటుకు వెంటనే జమ చేయాలని డిమాండ్ చేశారు. లేనట్లయితే ప్రభుత్వ అసంబద్ధ విధానాల పైన ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని, జిల్లా అధ్యక్షులు కేశపురం రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లమారి మల్లికార్జున్ లు తెలిపారు.